క్లుప్తంగా

వైభవంగా నృసింహస్వామి పల్లకీ సేవ



స్వామి వారి పల్లకీ ఊరేగింపు

ఉరవకొండ రూరల్: మండలంలో ప్రసిద్ధి చెందిన పెన్నహోబిలం నృసింహస్వామి పల్లకీ సేవను శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో శ్రీదేవి భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవ మూర్తులను ఉంచి డప్పు వాయిద్యాలు, మేల తాళాల నడుమ ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆర్డీటీని పరిరక్షించాలని పోస్టుకార్డు ఉద్యమం



పోస్టుకార్డులు చూపుతున్న దృశ్యం

కళ్యాణదుర్గం: పేదరిక నిర్మూలనకు విశేష కృషి చేస్తున్న ఆర్డీటీకి వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు స్థానికులు పోస్టుకార్డులు రాశారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు రాజన్న ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. విద్యా, వైద్యం, గృహ నిర్మాణం, వ్యవసాయం, పర్యావరణం తదితర రంగాల్లో విశేష కృషి చేసిన ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ మిత్ర హనుమంతప్ప, గ్రామస్తులు విశ్వనాథ్, తిమ్మప్ప, గంగన్న, దొణతిమ్మ, హరిత, గీతాంజలి, సరోజ, లక్ష్మీదేవి, నాగజ్యోతి, వరలక్ష్మి, దుర్గమ్మ, సునీత పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న రిడ్స్ ప్రతినిధులు

కళ్యాణదుర్గం: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్ అన్నారు. శనివారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపిస్తుంది, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు విషయాలను తెలియజేశారు. విద్యార్థినులు చెడు వ్యసనాలకు లోను కాకూడదన్నారు. డ్రగ్స్ వల్ల అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ నాగజ్యోతి, ఏఎన్ఎం గీతా, కిరణ్ కుమార్, వరలక్ష్మి, రిడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

15 నుంచి స్మార్ట్ రైస్ కార్డులు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలో కొత్త స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ నాగరాజు శనివారం తెలిపారు. అర్బన్, రూరల్ పరిధిలో 33 వేల కుటుంబ రేషన్‌కార్డుదారులకు ఈ నెల 15 నుంచి స్మార్ట్ కార్డుల పంపిణీని ప్రారంభిస్తామన్నారు.


కళేబరాన్ని తొలగించండి

బొమ్మనహాళ్: దేవగిరి క్రాస్ సమీపంలో హెచ్చెల్సీ 1వ డిస్ట్రిబ్యూటరీ కాలువలో కొట్టుకొచ్చిన గేదె కళేబరాన్ని తొలగించాలని రైతులు శుక్రవారం కోరారు. ఈవిషయాన్ని లస్కర్లకు తెలిపినా పట్టించుకోలేదన్నారు.

వర్షపు నీరు మళ్లింపు

ఉరవకొండ: 9వ వార్డు ఈశ్వరమ్మ ఆలయం వద్ద ఉన్న కాలనీల్లోకి వర్షపునీరు చేరింది. ఈనెల 12న వర్షబీభత్సం కింద ప్రచురితమైంది. మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్, సిబ్బంది కాలనీల్లో పర్యటించి వర్షపు నీటిని మళ్లించారు. కాలనీల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు.

కేన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండలంలోని ఎర్రగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హరిజన హనుమంతరాయుడుకు గుంతకల్లు యువశక్తి కంప్యూటర్ సంస్థ డైరెక్టర్ జయన్న రూ.30వేలు ఆర్థికసాయం శనివారం అందించారు. కేన్సర్‌తో బాధపడుతున్న హనుమంతరాయుడుకు తన మిత్రుల ద్వారా మరో రూ.20 వేలు రెండు రోజుల్లో అందిస్తామని రాయుడి కుటుంబ సభ్యులకు జయన్న హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివలింగ, రుద్రముని, జయచంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యానికి భరోసా ఏదీ?



గ్రామ సచివాలయాల్లో కనిపించని వివాహ నమోదు

- అధికారులు, ప్రజల్లో కొరవడిన అవగాహన
- చట్టం అమలైతేనే బాల్య వివాహాలకు అడ్డుకట్ట

ఉరవకొండ: గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను అరికట్టాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా.. క్షేత్రస్థాయిలో పట్టించుకునే వారే కరువయ్యారు. గ్రామ పంచాయతీల్లో వివాహాల నమోదు తప్పనిసరి అని ప్రభుత్వాలు చెప్తున్నా ఎక్కడా పాటించలేదు. దీంతో గ్రామీణుల్లో అవగాహన లోపంతో నేటికీ బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. పంచాయతీల్లో వివాహాల నమోదు తప్పనిసరి చేస్తూ 2002లో చట్టం చేశారు. జీఓ నంబర్ 193 ప్రకారం పంచాయతీ కార్యదర్శులు వివాహాల నమోదు చేపట్టాల్సి ఉన్నా నేటికీ వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించలేదు. దీంతో పలువురికి జనన, మరణ ధ్రువీకరణ పత్రాలపై తప్ప వివాహాల నమోదుపై అవగాహన లేదు. ఆడ పిల్లలకు 18 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్ల వయస్సుకు తప్పనిసరి అనే విషయం గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాల్సి ఉంది. ఇప్పుడు ప్రతిదానికి వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరి చేసినా ఆ వైపు అడుగులు పడడం లేదు.

సచివాలయాల్లోనే నమోదు

గతంలో గ్రామ పంచాయతీల్లో వివాహ నమోదు ప్రక్రియ ఉండగా, ఇప్పుడు గ్రామ సచివాలయాల్లో చేపడుతున్నారు. వివాహం జరిగిన 30 రోజుల్లోపు పంచాయతీ కార్యదర్శి వద్ద దరఖాస్తు చేసుకుంటే వివాహ నమోదు ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. ఆతర్వాత రూ.100 చెల్లించి, సర్టిఫికెట్ పొందొచ్చు.

అవగాహన లోపంతోనే..

ఒక వైపు ఆర్థిక సమస్యలు, మరోవైపు అవగాహన లేమితో గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నాయి. జిల్లాలో పలుచోట్ల ఇప్పటికీ బాల్యవివాహాలు జరుగుతూనే ఉన్నాయి. వీటిని అడ్డుకునేందుకు గ్రామస్థాయిలో మహిళా పోలీసు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు జంకుతున్నారు.



ఆమిద్యాలలోని గ్రామ సచివాలయం

అవగాహన అవసరం



గ్రామీణ ప్రాంతాల్లో పదో తరగతి పూర్తి కాగానే బాలికలకు బాల్య వివాహాలు చేస్తుంటారు. బాల్య వివాహాలపై పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించాం. పంచాయతీల్లో వివాహాలను నమోదు చేసుకోవాలనే నిబంధన విధిగా పెడితే వాటిని అరికట్టవచ్చు.

– బీఎస్ శ్రీదేవి, సీడీపీఓ, ఉరవకొండ

ఆదేశాలు జారీ చేశాం



గ్రామాల్లో వివాహాల నమోదును తప్పనిసరి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. ప్రజలకు కూడా దీనిపై అవగాహన కల్పిస్తున్నాం. చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రజలు సహకరించాలి.

– రవిప్రసాద్, ఎంపీడీఓ, ఉరవకొండ

‘కూటమి’ది మహిళా వ్యతిరేక ప్రభుత్వం



కూటమి ప్రభుత్వ మోసాలను మహిళలకు వివరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గంటౌన్: కూటమిది మహిళా వ్యతిరేక ప్రభుత్వమని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అన్నారు. సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని 20, 23 వార్డుల్లో కౌన్సిలర్ పైతోట సంజీవప్ప, పార్టీ పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. వైఎస్ జగన్‌కంటే మెరుగైన పాలన అందిస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు మాటలను ప్రజలు మర్చిపోలేదన్నారు. తీరా అధికారంలోకొచ్చి అన్నింటికీ కోతలు పెట్టారన్నారు. ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా కూటమి పాలన సాగుతోందన్నారు. రైతులకు కనీసం యూరియా కూడా సక్రమంగా సరఫరా చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నిత్యం ప్రజల పక్షాన ఉంటుందని, ప్రభుత్వ మెడలు వంచి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు పోరాటం చేస్తామన్నారు. ఈ సందర్భంగా అనేక మంది మహిళలు తమకు గతంలోనే సంక్షేమ పథకాలు సక్రమంగా అందేవని, ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌని లావణ్య, శారదాదేవి, ఫకృద్దీన్, మాజీ కౌన్సిలర్ రఘురాం, కో ఆప్షన్ సభ్యుడు నజీర్, వార్డు ఇన్‌చార్జ్‌లు పైతోట రఘు, నిజాముద్దీన్, రామాంజనేయులు, అరవా శివప్ప, ప్రచార కార్యదర్శి తిప్పేస్వామి, బడిగే బషీర్, కొలిమి ఆనంద్, చంద్రశేఖర్‌రెడ్డి, కామయ్యతోట నాగేంద్ర, హరి, రాజు, గిరి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ ‘బాబు’



జాజరకల్లులో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

డి.హీరేహాళ్(బొమ్మనహాళ్): మోసానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం డి.హీరేహాళ్ మండలంలోని జాజరకల్లు, హిర్దేహాళ్ గ్రామాల్లో సాయంత్రం బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ సూపర్ సిక్స్ పథకాలు కుటుంబంలో ఎంతమందికి అందుతున్నాయనే విషయాలను తెలుసుకున్నారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు లెక్కకు మించిన హామీలు ఇచ్చి మోసం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంపై ఇప్పటికే గ్రామాల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి అటకెక్కిందన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకొచ్చిన కూటమి నేతలను ప్రజలు నిలదీయాలన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500, ఏటా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ..ఇలా ఏ ఒక్క పథకం అమలు చేయలేదన్నారు. ప్రజలంతా కూటమి ప్రభుత్వం పాలనపై విసిగిపోయారన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ బోదరాజు నాయక్, సీనియర్ నేత సుదర్శన్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు తోండా వెంకటేశులు, జిల్లా కమిటీ అధ్యక్షుడు సదీప్‌గౌడ్, తాలుకా బూత్ కమిటీ అధ్యక్షుడు అంజినరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు కురుబ హనుమంతరెడ్డి, మడేనహళ్లి సర్పంచ్ ఆంజినేయ, నాయకులు కరడి మల్లి, విజయగౌడ్, ఈశ్వరగౌడ్, రమేష్, తిమ్మప్ప, రామన్న, తిప్పేస్వామి, సురేష్, హంపన్నగౌడ్, తిమ్మప్ప, ఆనంద్, జగనాథ్, వన్నూరుస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం



ఉరవకొండ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం



కళ్యాణదుర్గంలో లోక్ అదాలత్ కార్యక్రమంలో పాల్గొన్న జడ్జి, అధికారులు

ఉరవకొండ: స్థానిక ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌ను ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో మొత్తం 101 కేసులు రాజీమార్గంలో పరిష్కారమయ్యాయి. ఇందులో ఐపీసీ–4, ఎక్సైజ్–28, బ్యాంకు కేసులు–16, ఎస్‌టీసీ కేసులు–53 పరిష్కారమయ్యాయి. వీటి ద్వారా రూ.7,86,500 వచ్చింది. ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి మాట్లాడారు.

లోక్ అదాలత్‌లో 491 కేసుల పరిష్కారం

రాయదుర్గంటౌన్: రాజీమార్గం ద్వారా జాతీయ లోక్ అదాలత్‌లో రాయదుర్గం డివిజన్ పరిధిలోని 491 కేసులను పరిష్కరించినట్లు ఇన్‌చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి కె.భాను తెలిపారు. శనివారం రాయదుర్గం పరిధిలోని కేసులు కళ్యాణదుర్గం కోర్టులో జడ్జి ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్‌కు వచ్చాయి. వీటిలో 420 ఎస్‌టీసీ కేసులు, 15 ఐపీసీ, బీఎన్ఎస్ కేసులు, 55 ఎక్సైజ్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించినట్లు తెలిపారు.

రాజీమార్గమే రాజమార్గం

కళ్యాణదుర్గం రూరల్: రాజీమార్గమే రాజమార్గం అని కళ్యాణదుర్గం జడ్జి భాను పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కోర్టులో పోలీసులు, అధికారులు సమన్వయంతో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్‌లో కళ్యాణదుర్గం కోర్టులో వివిధ సెక్షన్లలో నమోదైన కేసుల్లో 362 కేసులు పరిష్కరమయ్యాయి. జడ్జి భాను మాట్లాడుతూ, చిన్న విషయాలకు పంతాలకు పోయి ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకొని పోలీసులు, కోర్టుల చుట్టూ తిరుగుతూ జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

భావిపౌరులను తీర్చిదిద్దేది గురువులే



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కణేకల్లు: భావిభారత పౌరులను తీర్చిదిద్దేది గురువులేనని ఎంఈఓ–1 లక్ష్మణ్ణ, ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు టీ.శేషారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మార్కెట్‌స్కూల్‌లో ఉత్తమ అవార్డు గ్రహీత ఉపాధ్యాయులను సన్మానం చేశారు. వారు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉందన్నారు. అనంతరం అవార్డు గ్రహీతలైన శ్రీధర్ (గంగలాపురం), శ్రీరాములు (గోపులాపురం) వెంకటేశులు (గంగలాపురం) సరిత (జెడ్పీహెచ్ఎస్ హనకనహాళ్)లను ఎంఈఓతోపాటు ఉపాధ్యాయులు శాలువా కప్పి పూలమాలలేసి సన్మానించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం :

ఆటల పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతులు అందించారు. షటిల్, క్రికెట్, మ్యూజికల్ ఛైర్స్, బాల్‌అండ్‌బకెట్‌తోపాటు ఇతర ఆటల్లో విజయం సాధించిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండలశాఖ ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్లు రాఘవమ్మ, జయరామిరెడ్డి, శివారెడ్డి, పరమేశ్వరప్ప, సురేష్‌రెడ్డి, రామ్మోహన్‌గౌడ్, నక్క నాగరాజు, కుళ్లాయిస్వామి, చిన్న వెంకటేశులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

తోపుదుర్తి భాస్కర్‌రెడ్డికి నివాళి



తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న బోయ సుశీలమ్మ తదితరులు

వజ్రకరూరు: అనంతపురంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతదేహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయ సుశీలమ్మ, వెంకటాంపల్లి సర్పంచు భూమా కమలారెడ్డి, జిల్లా నాయకురాలు గీతమ్మ పూలమాల వేసి, నివాళులర్పించారు. భాస్కర్‌రెడ్డి సతీమణి, మాజీ జెడ్పీచైర్‌పర్సన్ తోపుదుర్తి కవిత, కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఫౌంటేన్ కాదు... పైప్‌లైన్ లీకేజీ



శ్రీరామరెడ్డి తాగునీటి పథకం పైప్‌లైన్ పగిలి నీరు ఎగిసిపడుతున్న దృశ్యం

కణేకల్లు: కణేకల్లు హెచ్చెల్సీ అక్విడెక్ట్ పక్కన శ్రీరామరెడ్డి తాగునీటి పథకం పైప్‌లైన్ శనివారం పగిలి నీరు వృథాగా పోతోంది. పైప్‌లైన్ పగలడంతో నీరు ఫౌంటేన్ తరహాలో ఎగిసిపడుతోంది. నీరు వృథాగా వెళ్లడంతో పాటు నీరు కలుషితమయ్యే అవకాశముందని ప్రజలు తెలిపారు. మరమ్మతులు చేయకపోతే నీటిలీకేజ్ మరింత ఎక్కువకానుందని ప్రజలు అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మత్తు పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇండేన్ గ్యాస్ సిలిండర్ల కోసం అవస్థలు



ఉంతకల్లులో ఖాళీ గ్యాస్ సిలిండర్లను ప్రైవేట్ వ్యాన్‌లో తీసుకెళ్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని పలు గ్రామాలకు నెలరోజులుగా ఇండేన్ గ్యాస్ సిలిండర్లు సరఫరా కావడంలేదు. మండలంలో ఇండియన్ గ్యాస్ వినియోగదారులు ఎక్కువ మంది ఉన్నారు. కణేకల్లు నుంచి బొమ్మనహాళ్‌కు ఇండేన్ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. గతంలో ప్రతి గ్రామానికీ వారంలో రెండుసార్లు వచ్చేవని వినియోగదారులు చెప్తున్నారు. రెండు వారాలైనా బొమ్మనహాళ్, ఉంతకల్లు, దేవగిరి, ఉద్దేహాళ్, నేమకల్లు, కురువల్లి, చంద్రగిరి, సిద్ధరాంపురం, బండూరు, హరేసముద్రం, దేవగిరి క్రాస్ తదితర గ్రామాలకు గ్యాస్ సిలిండర్లు వ్యాన్ రావడం లేదంటూ ప్రజలు చెప్తున్నారు. ఆటోలను అద్దెకు తీసుకొని కణేకల్లులోని గ్యాస్ గోడౌన్‌కు వెళ్లి అదనంగా ఒక సిలిండర్‌కు రూ.50 నుంచి రూ.100 ఖర్చు చేసి తెచ్చుకుంటున్నారు. కొందరు ఒక్కో సిలిండర్ రూ.1100, రూ.1200కు విక్రయిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాలకు ఇండియన్ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పెరిగిన సాగు వ్యయం ..తగ్గిన విస్తీర్ణం

- ఆందోళనలో వరి రైతులు
- ఏటేటా పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు



నాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్న వరి నారు

కూడేరు: వేరుశనగ తర్వాత రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేది వరి. అయితే అన్నదాతకు సాగు భారమైంది. దీనికితోడు నీటి కొరతతో సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది. సాగు వ్యయం, నీటి లభ్యత, విద్యుత్ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకొని అధిక విస్తీర్ణంలో వరి సాగుకు అన్నదాతలు ఆసక్తి చూపలేదు. మండల వ్యాప్తంగా వరి పంట సాగు సుమారు 2000 ఎకరాలుకు పైగానే ఉంటుంది. కానీ 3 ఎకరాలు లోపే వరి పంట సాగు చేయడానికి సిద్ధపడుతున్నారు. ఇప్పటికే పలువురు ముందస్తుగా వరి నారు పోసుకుని నాట్లు వేసుకున్నారు. మరికొందరు పొలాల్లో వరి నాట్లకు సిద్ధమవుతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 600–800 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అడుగంటిన భూగర్భజలాలు..

ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయ బోర్లలో నీటి లభ్యత తగ్గిపోతోంది. మరోవైపు అన్నదాతకు కాడెద్దులు కరువయ్యాయి. యంత్రాలపై ఆధారపడి వ్యవసాయం చేయాల్సి వస్తోంది. తద్వారా పంటల సాగు పెట్టుబడి ఖర్చు పెరిగిపోతోంది. ట్రాక్టర్‌తో నేలను దుక్కి చేయాలంటే గంటకు రూ.1,200 అద్దె చెల్లించాల్సి వస్తోంది. ఎకరం నేలను దుక్కి చేయడానికి 4 గంటల వరకు సమయం పడుతుండడంతో రూ.4,800 ఖర్చు వస్తోంది. వరి నారు పెంచడానికి 50 కేజీల వడ్ల ప్యాకెట్ కావాల్సి ఉంటుంది. నాణ్యతను బట్టి ప్యాకెట్ రూ.1,200 ఉంటుంది. వరి నాట్లు వేయడానికి కూలీలకు సుమారు రూ.4వేల వరకు ఇవ్వాల్సి ఉంటుంది. వరి నాటే సమయంలో రూ.2వేల వరకు ఎరువులు, మధ్యలో పంట పెరగడానికి, తెగుళ్ల నివారణ మందుల పిచికారీకి రూ.4వేల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఎకరా విస్తీర్ణంలో పంట సాగుకు సుమారు రూ.16 నుంచి రూ. 20 వేలు వరకు పెట్టుబడి అవుతోంది.

ఇళ్ల ముందు ఇలా... వెళ్లేదెలా?



ఇందిరమ్మ కాలనీలో నిలిచిన వర్షపునీరు

కణేకల్లు: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో వర్షం వచ్చిందంటే చాలు.. బురదమయమవుతుంది. రోడ్డు పొడవునా వర్షపు నీరు నిలుస్తుంది. వర్షం, బురదలో రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఇందిరమ్మ కాలనీలో చాలా చోట్ల సరైన దారులు లేవు. కొన్నిచోట్ల మాత్రమే అధికారులు సిమెంటు రోడ్లు వేశారు. వర్షం వస్తే ఈ రోడ్లన్నీ బురదమయంగా మారుతాయి. దీనికితోడు అపరిశుభ్రతతో దోమల బెడద అధికమైంది.

ఏఐఎఫ్‌డీఎస్ నూతన కమిటీ ఎంపిక



ఏఐఎఫ్‌డీఎస్ నూతన కమిటీ సభ్యులు

ఉరవకొండ: విద్యార్థుల సమస్యల పరిష్కారమే అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) లక్ష్యమని నాయకులు అన్నారు. శనివారం స్థానిక ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏఐఎఫ్‌డీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కుళ్లాయిస్వామి, ప్రధాన కార్యదర్శి మధు, ఉపాధ్యక్షుడిగా సాయి, భాస్కర్, మండల సహాయ కార్యదర్శులుగా మహేష్, వినయ్, కిరణ్, వంశీ, కార్తీక్, కుమార్, రాజేష్‌తో పాటు 11 మంది కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందు, సిద్ధూ, జిల్లా నాయకులు తరుణ్ మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగింపు



ఎంపీడీఓ కార్యాలయం ముందు తొలగించిన చెత్తాచెదారం

కూడేరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శనివారం చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు తొలగించారు. గురువారం ‘సాక్షి’లో కార్యాలయమా.. కంపోస్టు యార్డా .. శీర్షికన ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన కార్యాలయ అధికారులు కార్యాలయం ఎదుట ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించారు.

ఈక్రాప్ నమోదును పూర్తి చేయండి



అప్పిలేపల్లి సమీపంలో ఈక్రాప్ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

కుందుర్పి: మండలంలోని 10 రెవెన్యూ గ్రామాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది ఈక్రాప్ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని ఏఓ విజయ్‌కుమార్, ఏఈఓ కులశేఖర్‌రెడ్డి తదితరులు సూచించారు. శనివారం అప్పిలేపల్లి తదితర గ్రామాల్లో రైతుల సాగు చేసిన వివిధ రకాల పంటను ఈక్రాప్ కింద నమోదు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అతావుల్లా, వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



బచ్చేహళ్లిలో తెగిన విద్యుత్ వైర్లు

శెట్టూరు: మండలంలోని బచ్చేహళ్లి ఎస్సీ కాలనీలో మారెప్ప ఇంటిపైన విద్యుత్ స్తంభం నుంచి వైరు తెగిపడింది.వైరు వర్షపునీటిలో పడడంతో చుట్టుపక్కల ఇళ్లకు షాక్ తగిలింది. కాగా గమనించిన స్థానికులు అటుగా ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తపడ్డారు.దీంతో ప్రమాదం తప్పింది. గ్రామంలో విద్యుత్ కనెక్షన్లపై విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు.

నేమకల్లు అంజన్నకు పూజలు



ప్రత్యేక అలంకరణలో నేమకల్లు అంజన్న

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అర్చకుడు అనీల్‌కుమార్ చార్యులు వేదమంత్రోచ్చారణల మధ్య అంజన్నకు ప్రత్యేక పూజలు చేశారు. అన్నసంతర్పన చేశారు.